www.prajavoice.in

# ప్రజా వాయిస్

తెలుగు డిజిటల్ దిన పత్రిక

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

Contact:- 9849343720

/ PRAJA VOICE

సంపుటి : 1 | సంచిక : 15 | ఎడిటర్ : మేనం శ్యామ్ | గురువారం 03-7-2025 | పేజీలు : 4

## సిరా చుక్క

"నన్ను పాతిన మట్టిలోనే, నేను
మొలకెత్తాను!"

ఎవరైనా నన్ను ఓడిపోయాడని భావించారు,
కానీ అదే చోట నేను తిరిగి ఎదిగాను.
వాడిపోయినట్టు కనిపించినా,
చెట్టు కోసిన చోటే కొత్త కొమ్మ పెరిగింది.

నన్ను నేలలో పాతే ప్రయత్నం చేశారు,
కానీ వాళ్లకు తెలియదు
గింజ పాతితే మొలకెత్తుతుంది అనే నిజం.
ఆ నిజం గుర్తు చేసుకుంటే, వాళ్లే
తటస్థమవుతారు.
అబద్ధం ఎంత అగమ్యగోచరమైనా,
దానికి కాల పరిమితి ఉంటుంది.
నిజం ఎప్పటికీ నిలబడుతుంది ం
ఒక్కసారి కాకపోతే రెండోసారి...
అయినా నిలుస్తుంది!
నన్ను మోసం చేసినవాడు ఇప్పుడు
కంగారుపడుతున్నాడు.
ఎక్కడా మొలకెత్తదనుకున్న చోటే,
పులి మళ్లీ పరుగులెడుతోంది.
నేను ఎదగడం చూసిన క్షణం అతడి
గుండెల్లో వణుకు మొదలైంది.
నా విజయమే అతడి ఓటమికి సంకేతంగా
మారింది.
ఎక్కడ శత్రువు అంతమయ్యాడనుకున్నారు,
అక్కడే కొత్త జీవితం మొలకెత్తింది!

పార్వతి రాజేష్

ప్రజా వాయిస్
ఇది ప్రజల గొంతుక

# కడసారి చూపూ దక్కని ఘోరం!

### మూడు రోజులైనా ఆచూకీ లభించని పది మంది





**సంగారెడ్డి, జూలై 2 :** సిగాచి పరిశ్రమ దుర్ఘటనలో ఆత్మీయులను కోల్పోయిన వారికి కడసారి చూపూ దక్కని వేదన వర్ణనాతీతంగా మారింది. గల్లంతైన వారిలో పది మంది ఆచూకీ దొరకని పరిస్థితి నెలకొంది. ప్లాంటులోని డ్రయర్‌కు సమీపంలో పనిచేస్తున్న ఆ పది మంది మంటల ఉధృతితోపాటు రసాయనాల ప్రభావంతో ఎముకలు సైతం బూడిదైపోయి ఉంటారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక పూర్తిగా కాలిపోయి మాంసపు ముద్దలుగా మారిన మరో 20 మందికిపైగా మృతదేహాల గుర్తింపులోనూ జాప్యం జరుగుతోంది. ప్రమాదం జరిగి మూడు రోజులైనా తమవారి జాడ లేక.. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఆచూకీ చెప్పాలంటూ బుధవారం పరిశ్రమ వద్ద ఆందోళనకు దిగారు. మృతులు, గల్లంతైన వారి విషయంలో ప్రభుత్వం, కంపెనీ ప్రతినిధులు ఒక్కో లెక్క చెబుతుండటం గందరగోళానికి దారితీస్తోంది.


**ప్రత్యేకంగా గాలింపు చేపట్టినా..**

ప్రమాదంలో ఆచూకీ తెలియకుండా పోయిన వారి కోసం బుధవారం ఘటనా స్థలిలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక బృందాలు.. శిథిలాల్లో గాలించాయి. అదనపు వాహనాలను, పరికరాలను తెప్పించి సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాలను టిప్పర్లతో ఖాళీ ప్రదేశాలకు తరలించి, మృతదేహాల అవశేషాల కోసం వెతుకుతున్నట్టు తెలిసింది. బుధవారం ఒకరి చెయ్యి బయటపడగా మార్చురీకి తరలించారు. మంగళవారం రాత్రి నుంచీ కురుస్తున్న వర్షంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది.

**మరణాలపై తికమక..**

మంగళవారం ఉదయం మృతుల సంఖ్య 36కు చేరిందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అదే రోజు సాయంత్రం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఘటనా స్థలిని పరిశీలించారు. 46 మంది వరకు చనిపోయినట్టు అధికారుల ద్వారా తెలిసిందని చెప్పారు. బుధవారం ఉదయం సిగాచి పరిశ్రమ యాజమాన్యం 40 మంది మృతిచెందారని ప్రకటించింది. రాత్రి సంగారెడ్డి కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో మృతుల సంఖ్య 38 అని ఉంది. మరోవైపు పోస్టుమార్టం గదికి 45కు పైగా మృతదేహాల నమూనాలు వచ్చినట్టు చర్చ జరుగుతోంది. కాగా, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో పదిమంది పరిస్థితి విషమంగా ఉందని, అందులోనూ ఆరుగురు వెంటిలేటర్లపై ఉన్నారని సమాచారం. మరో ఆరుగురి శరీరాలు 70శాతానికి పైగా కాలిపోయాయని, వారిని మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించాలని వారి బంధువులు కోరుతున్నారు. సిగాచి పరిశ్రమ నిర్వహణ తీరు, అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో కర్మాగారశాఖ, బాయిలర్స్ విభాగం, అగ్నిమాపక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల నిర్లక్ష్యం ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. బాధ్యులపై వేటు వేయడానికి ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. కాగా, సిగాచి దుర్ఘటనలో మృతిచెందిన తమ రాష్ట్ర కార్మికులు, క్షతగాత్రుల కోసం ఒడిశా అధికారుల బృందం బుధవారం పాశమైలారం చేరుకుంది.

## గాజాలో కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ ఓకే: ట్రంప్



టెహ్రాన్/వాషింగ్టన్, జూలై 2: హమాస్ నాయకులు, క్యాడర్ లక్ష్యంగా గాజాపై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్.. 60 రోజుల పాటు కాల్పుల విరమణకు అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు తన సామాజిక మాధ్యమ సంస్థ 'ట్రూత్ సోషల్'లో ఓ పోస్టు చేశారు. "కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ అంగీకరించింది. అన్ని వైపుల నుంచి సంప్రదింపులు జరుపుతున్నాం. ఈ యుద్ధాన్ని ముగించడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. అయితే.. కాల్పుల విరమణ ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందనే విషయాన్ని చెప్పలేదు. శాంతి చర్చలకు సహకరించిన ఖతార్, ఈజిప్ట్ వర్గాలను ఆయన అభినందించారు.

## ఐదేళ్లూ నేనే ముఖ్యమంత్రి

### సిద్దరామయ్య

**ఆయనకు మద్దతివ్వడం తప్ప మరో దారి లేదు: డీకే**

**బెంగళూరు, జూలై 2 :** నాయకత్వ మార్పుపై ఊహాగానాలు జోరందుకున్న నేపథ్యంలో కర్ణాటక సీఎం సిద్దరామయ్య స్పందించారు. చిక్కబళ్లాపురలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని, ఈ విషయంలో ఎలాంటి అనుమానం అవసరం లేదని స్పష్టంచేశారు. బీజేపీ నేతలు అబద్ధాలు చెప్పడంలో దిట్టలని, నిజాలు చెప్పడం వారికి తెలియదని విమర్శించారు. తన



నాయకత్వంపై పార్టీలో ఎలాంటి అసంతృప్తి లేదని చెప్పారు. పార్టీ కోసం శ్రమించిన డీకే శివకుమార్‌ను గుర్తించి, ఆయనను సీఎం చేయాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు కదా అని మీడియా ప్రశ్నించగా.. అందరూ ఎంతో కష్టపడ్డారని, తాను ఒంటరివాడిని కాదని సిద్దరామయ్య పేర్కొన్నారు. మరోవైపు, సిద్దరామయ్యకు మద్దతు ఇవ్వడం తప్ప తనకు మరో మార్గం లేదని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టంచేశారు. చిక్కబళ్లాపుర జిల్లా నందిహిల్స్‌పై జరుగుతున్న క్యాబినెట్ మీటింగ్‌కు హాజరయ్యే సమయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సిద్దరామయ్యకు అండగా ఉండి సహకరిస్తానని తెలిపారు. కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. ఓవైపు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రణదీపసింగ్ సుర్జేవాలా బెంగళూరులో ఎమ్మెల్యేలతో చర్చలు కొనసాగిస్తుండగానే డీకే శివకుమార్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది.

## యూరియా కొరత తీర్చండి

**నెలవారీ కేటాయింపుల మేరకు ఇవ్వండి**

**కేంద్ర ప్రభుత్వానికి మంత్రి తుమ్మల లేఖ**



**హైదరాబాద్, జులై 2**

రాష్ట్రంలో యూరియా కొరతతో రైతు లు ఇబ్బందులు పడుతున్నారని, నెలవారీ కేటాయింపుల ప్రకా రం రాష్ట్రానికి సరఫరా చేయాలని కేంద్రా న్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఇప్పటికే పలుమార్లు లేఖలు రాసిన తుమ్మల... తాజాగా బుధవారం మరోసారి కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డా, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్‌కు లేఖలు రాశారు. వానాకాలం సీజన్ ప్రారంభమై ఇప్పటికే నెల రోజులు పూర్తయిందని, యూరియా కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో కలిపి రాష్ట్రానికి 5 లక్షల టన్నుల యూరియా కేటాయించినా... కేవలం 3 లక్షల టన్నులు మాత్రమే రాష్ట్రానికి వచ్చిందని గుర్తు చేశారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో యూరియా వినియోగం అత్యధికంగా ఉంటుందని ఈ తరుణంలో.. కిషన్‌రెడ్డి, సంజయ్ చొరవ తీసుకొని రాష్ట్రానికి యూరియా కోటాను తెప్పించాలని విజ్ఞప్తి చేశారు. జూలై నెలలో కేటాయించిన 97 వేల టన్నుల యూరియాను ఓడరేవుల నుంచి రాష్ట్రానికి సరఫరా చేయాలని కోరారు. అదేక్రమంలో రామగుండం ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీ నుంచి యూరియా కేటాయింపులను 30,800 టన్నుల నుంచి 60 వేల టన్నులకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. గత మూడు నెలల్లో వచ్చిన లోటును భర్తీ చేయటానికి అదనపు కేటాయింపులు చేయాలని కోరారు. కాగా, చేనేత కార్మికులకు లక్ష వరకు రుణమాఫీ చేయటానికి రూ.33 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. దీంతో 5,691 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

## ఫార్మాసిటీ భూముల్లో కాంగ్రెస్ నేతల దోపిడీ

### రైతన్నల ఇండ్ల స్థలాలూ వదల్లేదు: కేటీఆర్

**హైదరాబాద్, జూలై 2:**

హైదరాబాద్ ఫార్మాసిటీ భూముల్లో కాంగ్రెసపార్టీ నేతలు దోపిడీకి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఫార్మాసిటీ భూములపై కాంగ్రెస్ నేతలు గద్దల్లా వాలి దోచుకుంటున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలోతొక్కిన ముఖ్యమంత్రి.. తమపార్టీ నేతలతో కలిసి ఫార్మాసిటీ భూములను కొట్టేస్తున్నారని బుధవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతన్నలకు నష్టపరిహారంగా కేటాయించిన ఇండ్ల స్థలాలను కాంగ్రెసనేతలు తమ పేర్లపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో గెలవగానే ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దుచేసి, భూములను రైతన్నలకు తిరిగి ఇస్తామన్న హామీ ఏమైంది? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రైతులకు నష్టపరిహారంగా దక్కాల్సినదాన్ని కాంగ్రెస్ నేతలు ఎందుకు దోచుకుంటున్నారని నిలదీశారు.




## రాష్ట్రంలో ఈ నెలంతా వర్షాలే !

**దేశ వ్యాప్తంగానూ అదే పరిస్థితి**

**రాష్ట్రంలో మరో 5 రోజులు**

**వానలు:వాతావరణ శాఖ**




హైదరాబాద్, జూలై 2: రాష్ట్రంలో ఈ నెల (జూలై)లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) బుధవారం వెల్లడించింది. అలాగే దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉంటుందని తెలిపింది. చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఇక చాలా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా ఉండే సూచనలున్నాయని వెల్లడించింది. అయితే, కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం కూడా ఉందని హెచ్చరించింది. మరోవైపు తెలంగాణపై నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం మహబూబాబాద్, కామారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిలాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసినట్లు వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం సగటు వర్షపాతం 2 సెంటీమీటర్లు నమోదైనట్లు తెలిపింది. గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురుస్తాయని పేర్కొంది. 7 వరకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది.

## వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది

**క్షతగాత్రులకు మెరుగైన చికిత్స**

**13 మంది ఆచూకీ లభించాల్సి ఉంది**

**బాధితులను పరామర్శించిన మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర**



**హైదరాబాద్, జూలై 13:** సిగాచి పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వైద్య ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. బుధవారం పీసీసీ అధ్యక్షుడు మహేషకుమార్‌గౌడ్, వైద్యారోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఆమె పాశమైలారంలోని పరిశ్రమ సంఘటన ప్రాంతాన్ని సందర్శించి బాధిత బంధువులతో మాట్లాడారు. అంతకుముందు పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆస్పత్రి, ధ్రువ ఆస్పత్రి, మాదీనగూడ ప్రణం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ.. ఇప్పటికే బాధితులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. మహేషకుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, మంత్రులు ఘటనపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారని, క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. పేలుడు ఘటనను ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణిస్తోందని బాధ్యులను వదిలే ప్రసక్తి లేదన్నారు. మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 36 మృతదేహాలు లభ్యమయ్యాయని, 13 మంది ఆచూకీ లభించలేదన్నారు. 11 మంది మృతదేహాలను అప్పగించామని, ఎఫ్ఎసఎల్ రిపోర్ట్ వచ్చాక మిగిలిన మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలిపారు. మిగిలిన శిథిలాలు తొలగిస్తే మిగతా 13 మంది ఆచూకీ లభించే అవకాశం ఉందన్నారు. బాధితులను పరామర్శించిన వారిలో శేరిలింగంపల్లి ఎమ్మెలే గాంధీ, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితరులున్నారు. కాగా, ప్రమాదంపై విచారణకు ఆదేశించాలని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యానిది తప్పు అని తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# కెవిపిఎస్ అధ్వర్యంలో మంత్రులకు వినతి.

**సమస్యల వలయంలో ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు..**

**- స్టడీ సర్కిల్స్ పునరుద్దరించాలి...**

**- అట్రాసిటీ బాధితులకు సకాలంలో పరిహారం అందించాలి...**

**- విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ నియమించాలి..**

**- సానుకూలంగా స్పందించిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,అడ్లూరు లక్ష్మణ్ కుమార్.**





**నల్గొండ, ప్రజా వాయిస్:-**
నల్లగొండ జిల్లాలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల విద్యార్థుల, యువత మరియు సంక్షేమ హాస్టల్స్ యొక్క సమస్యలు జఠిలంగా ఉన్నాయని వాటన్నింటిని పరిష్కారం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి కి విజ్ఞప్తి చేశారు.బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టరేట్ లో హాజరైన ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి కెవిపిఎస్ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా మంత్రులు స్పందిస్తూ బెస్ట్ అవైలబుల్ స్కీమ్ వంటి వాటికి వారం రోజులలోనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.మిగతా సమస్యలన్నింటినీ పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడగు నాగార్జున గత కొంతకాలంగా ఎస్సీ ఎస్టీ బి.సి,మైనారిటీల సంక్షేమానికి సంబంధించిన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు.బడ్జెట్ లో అంకెలలో నిధులు కేటాయింపులు జరుగుతున్నా ఆచరణలో మాత్రం మంజూరు కావడం లేదని,నల్లగొండ జిల్లాకు సంబంధించిన యువత, విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని,దళిత, గిరిజన,మైనార్టీ ప్రజాసంఘాలతోను, యువతతోను,విద్యార్థులతోను ప్రత్యేకమైన సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు.నల్లగొండ జిల్లా కేంద్రంలోని బి.కే పెంటయ్య హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరిందని,నిధులు కేటాయించి నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. జిల్లాలో అంబేద్కర్ భవన నిర్మాణాలకు స్వల్పమైన నిధులు మాత్రమే మంజూరు చేశారు.అవి చాలి చాలక గత నాలుగు ఏళ్లుగా నిర్మాణాన్ని చేపట్టడం లేదన్నారు.మంజూరైన 70 భవనాలకు ఒక్కొక్క భవనానికి కనిష్ఠంగా 20 లక్షల నిధులు కేటాయించే విధంగా చొరవ చూపాలని,అదేవిధంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సాంస్కృతిక ఆడిటోరియం సౌండ్ సిస్టం సరిగ్గా లేకపోవడం వలన నిరుపయోగంగా ఉన్నది.అవసరమైన నిధులు కేటాయించి తక్షణమే పూర్తిస్థాయిలోకి వినియోగంలోకి తీసుకు రావాలని కోరారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీ ల పై జరుగుతున్న దాడులపై పోలీస్ శాఖా వేగవంతంగా స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని,ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు కింద బాధితులకు వచ్చే పరిహారం నిధులు లేక పెండింగ్ లో ఉన్నాయని తక్షణమే నిధులను విడుదలచేయయాలన్నారు.బెస్ట్ అవైలబుల్ స్కీమ్ సంబంధించి పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్మిషన్స్ నిరాకరిస్తున్నాయని.తక్షణమే బాస్ కింద పెండింగ్ లో ఉన్న బిల్లుల అన్నింటిని మంజూరు చేయాలన్నారు.జిల్లాలో పెండింగ్ లో ఉన్న పీఓటి లకు సంబంధించిన భూముల సమస్యలను పరిష్కరించాలన్నారు.ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటిని నియమించుటకు చర్యలు తీసుకోవాలన్నారు.ప్రమోషన్ లలో దళిత గిరిజనులకు రిజర్వేషన్లను అమలు చేయడం లేదని,అడెక్వసీ విధానం ప్రమేషన్స్ ద్వారా అడ్డుకుంటున్నారని దీనిని తొలగించాలన్నారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం ద్వారా దళిత గిరిజనులకు 10 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు గతంలో స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేసిన వాటిని ఎత్తివేయడం జరిగిందని పేద విద్యార్థుల ఉద్యోగ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తక్షణమే ఆ స్టడీ సర్కిల్స్ ను పునరుద్ధరించాలన్నారు.వేయిల కోట్లలో పెండింగ్ స్కాలర్షిప్స్ మరియు ఫీజు రియంబర్స్మెంట్స్ పెండింగ్ లో ఉండడం వలన చదువు పూర్తయిన తర్వాత తమ యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకునే విషయంలో ఇవ్వకుండా పేద విద్యార్థులను ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు తీవ్రమైన ఇబ్బందులు పెడుతున్నాయని,.ఆ నిధులు మంజూరు చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలన్నారు. సంక్షేమ హాస్టల్స్ లో మౌలిక వసతులను మెరుగుపరుస్తూ,పక్కా భవనాలను నిర్మించుటకు చర్యలు తీసుకోవాలని, పెండింగ్ లో ఉన్న మెస్ బిల్లుల అన్నింటిని విడుదల చేయాలన్నారు.సంక్షేమ హాస్టల్స్ లో పెట్టెలు, దుప్పట్లు,ప్లేట్లు,గ్లాసులు,ఆట వస్తువులు కొంతకాలంగా ఇవ్వడం లేదని,వాటిని వెంటనే ఇప్పించే విధంగా చొరవ చూపాలని,వంట మనుషుల, స్కావెంజర్స్, కొరత తీవ్రంగా ఉన్నది అవసరమైన సిబ్బందిని తక్షణమే నియమించాల న్నారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల యొక్క ఉపకార వేతనాలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు రెమిడాల పరుశరాములు,గాదె నరసింహ, ఒంటెపాక కృష్ణ ,బొల్లు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి నల్గొండ జిల్లాలో మంత్రుల సమీక్షా సమావేశం

**- ఉమ్మడి జిల్లా కలెక్టర్ల పవర్ పాయింట్ ప్రజెంటేషన్...**

**- ఉమ్మడి జిల్లాలో అభివృద్ధికి పక్షం రోజులకు ఒకసారి సమీక్ష సమావేశం నిర్వహిస్తాం ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్.**

**పాల్గొన్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి..**




**నల్గొండ, ప్రజా వాయిస్:-**
నల్గొండ జిల్లా మంత్రులు, ఎంపీలు ,ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో నల్గొండ జిల్లాను ముందుకు తీసుకు వెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ తెలిపారు.బుధవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్ లో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్ష సమావేశంలో మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వ్యవసాయ సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని రకాలుగా అండగా ఉంటుందని, ప్రతిరోజు రైతులకు సంబంధించిన అంశాలపై మండల స్థాయి అధికారులతో జిల్లా అధికారి పర్యవేక్షణ చేయాలన్నారు. రైతు భరోసా, రైతు బీమా, ఎరువులు, విత్తనాల విషయంలో ప్రత్యేక దృష్టి నిలపాలని చెప్పారు. గత ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసిందని, అలాకాకుండా తమ ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి రైతు భరోసా వంటి ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేస్తున్నదని అన్నారు. జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటిని పూర్తిచేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఇరిగేషన్ ప్రాజెక్టులు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి విద్యుత్ శాఖ అధికారులు శాసనసభ్యుల విజ్ఞప్తుల మేరకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధికి పక్షం రోజులకు ఒకసారి సమీక్ష సమావేశం నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

**రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల**
**శాఖ మంత్రి నల్లమాడ ఉత్తంకుమార్ రెడ్డి**

ఈనెల 14న రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా తుంగతుర్తి నియోజకవర్గం, తిరుమలగిరిలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అప్పటివరకు రేషన్ కార్డుల కై వచ్చిన దరఖాస్తులన్నింటిని ఈనెల 13 లోగా పరిశీలించి అర్హులైన వారందరినీ ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు గొప్ప చరిత్ర ఉందని,జిల్లా ప్రజాప్రతినిధులు ,అధికారులు అందరూ కలిసి ఉమ్మడి జిల్లాను ఒక స్థాయికి తీసుకు వెళ్తామని చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ప్రాజక్టు లన్నింటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని, ప్రాజెక్టుల భూసేకరణ పై శాసనసభ్యులు ప్రత్యేక దృష్టి నిలపాలని కోరారు. ఎస్ఎల్బీసీ పనుల పునః ప్రారంభానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని, భారత సైన్యం లో పనిచేసిన అధికారులను డిప్యూటేషన్ పై తీసుకొని ఎలక్ట్రో మాగ్నెటిక్ లీడర్ సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డిండి, హెచ్ ఎల్ సి లైనింగ్ , నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ బునియాధిగాని కాలువ, పిల్లాయిపల్లి కాలువ, ధర్మారెడ్డి కాలువలను పూర్తి చేస్తామని అయితే వీటి భూసేకరణను పూర్తి చేసే విషయంపై శాసనసభ్యులు దృష్టి నిలపాలని కోరారు. అధికారులు ఆయా పథకాలకు లబ్ధిదారులు ఎంపికలో అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలని, నిజాయితీ, పారదర్శకతతో ప్రజలకు కనిపించేలా పని చేయాలని, నెలలో రెండుసార్లు సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

**రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

ఆర్ అండ్ బి ద్వారా నల్గొండ జిల్లాకు ఎక్కువ నిధులు తేవడం జరిగిందని, భవిష్యత్తులో మరిన్ని నిధులు ఇచ్చేందుకు కృషి చేస్తానని 45 కోట్లతో సంగెం బ్రిడ్జికి మంజూరు ఇవ్వడం జరిగిందని, నల్గొండ -మల్లేపల్లి -దేవరకొండ రహదారులను హామ్ రోడ్ కింద మంజూరు చేశామని, రాష్ట్రవ్యాప్తంగా 1200 కోట్ల రూపాయలతో అన్ని మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాలకు హాం పథకం కింద డబుల్ రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయడం జరిగిందని, పంచాయతీరాజ్ రోడ్లను సైతం హామ్ కింద కు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఎస్ ఎల్ బి సి, టన్నెల్ పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని ,ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ పై ప్రత్యేకంగా రివ్యూ చేస్తామని ,ఇన్చార్జి మినిస్టర్ జిల్లాకు ఎక్కువ సమయం కేటాయించాలని, ప్రాథమిక వైద్యం, విద్య ప్రభుత్వానికి అతి ముఖ్యమైనవని, వీటిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని , విద్యలో భాగంగా ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ పనులను త్వరలోనే ప్రారంభం చేయనున్నామని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో బాగా పనిచేయాలని, ఎస్డిఎఫ్ కింద ప్రతి ఎమ్మెల్యేలకు తక్షణమే ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని , ఇందుకు సంబంధించి టోకెన్లు రైజ్ చేయాలని ఎమ్మెల్యేలతో కోరారు. ఎనిమిది నెలల్లో నల్గొండ కలెక్టరేట్లో చేపట్టిన అదనపు బ్లాకు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ చిత్రియాల్, రాములోరి బండ లిఫ్ట్ ల గురించి మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.నాగార్జునసాగర్ నియోజక వర్గంలో పెండింగ్లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టు ట్రాన్స్కో బిల్లులను మంజూరు చేయాలని, గుర్రంపోడు బస్టాండు ఏర్పాటు విషయమై ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ 20 ఫీట్లు వెనక్కి జరపాలని, డొంకతండ, బోయగూడెం గ్రామాలలో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల స్వీకరించిన దరఖాస్తులు కనిపించడం లేదని, వెబ్సైట్ ను మరోసారి ఓపెన్ చేయించి ప్రజల నుండి మరోసారి దరఖాస్తులు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి కోరారు . జిల్లావ్యాప్తంగా ఎమ్మెల్యేలు తమ పరిధిలో ఉన్నటువంటి సమస్యలను సమీక్ష సమావేశంలో విన్నవించారు. ఇన్చార్జ్ మంత్రి జిల్లా మంత్రులు ఆ సమస్యల ఇంటింటికి త్వరలోనే పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని తెలిపారు .సమావేశంలో నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, నీటిపారుదల ,విద్య, వ్యవసాయం, వైద్యం ,ఆరోగ్యం, భూభారతి, మహిళా శక్తి, సంక్షేమం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశానికి వివరించారు.ఈకార్యక్రమానికి ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ,రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామెల్, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ,నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, తదితరులు ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.



# ఒక శాతం జనాభా ఉన్న వర్గానికి అధ్యక్ష పదవా?

**బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షులు అరవింద చారి**

**నాగర్ కర్నూల్ జిల్లా,ప్రజా వాయిస్**
రాష్ట్ర జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు కాదని, ఒక శాతం ఉన్న వర్గానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని పదవి కట్టబెట్టడం ఏంటని బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు అరవిందచారి అన్నారు. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో బీసీ పొలిటికల్ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి బీసీలకు ఇస్తామని చెప్పి,ఊరించి బీసీలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీల జపం చేస్తుంటే, బీజేపీ మాత్రం అగ్రకులాల జపం చేస్తుందని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీసీని సీఎం చేస్తామన్న బిజెపి చివరికి ఫ్లోర్ లీడర్ కూడా కులాలకు కట్టబెట్టిందని అరవింద్ చారి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అధ్యక్ష పదవి బీసీకి ఇవ్వని పార్టీ రేపు బీసీని సీఎం చేస్తానంటే బీజేపీని బీసీలు ఎప్పటికీ నమ్మరన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం చేయకుండా, బీసీలకు రాష్ట్ర పగ్గాలు ఇవ్వకుండా బిజెపి బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. బిజెపి లో అగ్రకుల హిందువులకు ఒక న్యాయం, బీసీ హిందువులకు ఇంకొక న్యాయమా? అని ప్రశ్నించారు. బిజెపిలో ఉన్న బీసీ నేతలు ఏమాత్రం ఆత్మ గౌరవం ఉన్న వెంటనే బిజెపికి రాజీనామా చేయాలని ఆయన అన్నారు.

# రోశయ్య జయంతిని రాష్ట్ర పండుగగా జరపడం విడ్డూరం

**- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్..**



**నల్గొండ, ప్రజా వాయిస్:**
మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు గవర్నర్గా పదవులు నిర్వహించిన కొణిజేటి రోశయ్య జన్మదినమైన జూలై 4ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర స్థాయి ఉత్సవంగా ప్రకటించడం పట్ల బీసీ సంఘాల ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. తమిళనాడు గవర్నర్గా పనిచేసిన వ్యక్తి జయంతిని తెలంగాణా ఉద్యమాన్ని తుడిచిపెట్టే ప్రయత్నంగా భావిస్తున్నామని, 'జై తెలంగాణ' అనే నినాదాన్ని తట్టుకోలేని రోశయ్యకు రాష్ట్ర స్థాయిలో ఘనత ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. జూన్ 28న ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 853లో అన్ని జిల్లాల్లో కలెక్టరేట్‌లు, ప్రభుత్వ కార్యాలయాల్లో పూలమాలలు వేసి వేడుకలు జరపాలని సూచించడం బాధాకరమన్నారు. "ఇది రోశయ్య వ్యక్తిగత అభిమానుల ఆచారం కావచ్చు, కానీ రాష్ట్ర అధికారిక కార్యక్రమంగా జరపడం సరికాదు. కాంగ్రెస్ పార్టీకి ఇష్టమైతే గాంధీభవన్‌లో ఉత్సవాలు జరుపుకోవచ్చు, కానీ ప్రజాధికార తెలంగాణలో ప్రభుత్వ ఆధ్వర్యంలో జరపడం మేము అనుమతించం," అని లింగంగౌడ్ హెచ్చరించారు. వెంటనే జీవోను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# గ్రంథాలయ సమస్యలను పరిష్కరించాలి...

**- గ్రంథాలయ సమస్యలపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చైర్మన్ కు వినతిపత్రం అందజేత**

**- గ్రంథాలయ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన చైర్మన్**



**మంథని ప్రజా వాయిస్:**
పెద్దపల్లి జిల్లా మంథనిలో శిథిలవస్థలో ఉన్న గ్రంథాలయాన్ని ప్రజాసంఘాల నాయకులు ఇటీవల సందర్శించి గ్రంథాలయ సమస్యలను పరిష్కరించాలని పోరాటం చేసిన నేపథ్యంలో ప్రజాసంఘాల పోరాట ఫలితంగా మంగళవారం పెద్దపెల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ మంథని గ్రంథాలయాన్ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు గ్రంథాలయ చైర్మన్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ మూల గట్టున ఉన్న గ్రంథాలయాన్ని మంథని కాలేజ్ గ్రౌండ్ లోకి మార్చాలని గ్రంథాలయాన్ని మోడల్ గ్రంథాలయంగా నిర్మించాలని 500 మంది పాఠకులు చదువుకునే విధంగా నిర్మించాలని , ఖాళీగా ఉన్న అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్ట్ తోపాటు ఇతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పోటీ పరీక్షకు సిద్ధమయ్యే విద్యార్థుల కొరకు అన్ని రకాల మెటీరియల్ ను మరియు పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తీసుకురావాలని అదేవిధంగా విజ్ఞాన కేంద్రంగా మంథని నియోజకవర్గ మారాలంటే ముందుగా గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ తక్షణ సమస్య పరిష్కరించి.... ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మంథని నియోజకవర్గ కేంద్రంలో అతి త్వరలోనే అన్ని హంగులాలతో అందరికీ అందుబాటులో ఉండే విధంగా నూతన భవనం ఏర్పాటుకు కృషి చేస్తానని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేస్తామని ప్రజా సంఘాల నాయకులకు హామి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్ , డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గోరెంకల సురేష్ , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బావు రవి , తదితరులు పాల్గొన్నారు.



# అక్కకి అంతక్రియలు చేసిన చెల్లలు

**కరీంనగర్, ప్రజా వాయిస్**
బెజ్జంకి మండలం తోటపెల్లి గ్రామంలో నివసిస్తున్న ఎంబరి కనుకవ్వ (75) అనారోగ్య కారణంతో మరణించింది.ఏ తోడులేని కనుకవ్వకు చెల్లెల్లే పెద్దదిక్కుగా నిలిచారు.ఒక తల్లి పిల్లలు అయిన ముగ్గురు చెల్లెల్లు అక్కకి దగ్గరుండి అంత్యక్రియలు పూర్తి చేశారు.కనుకవ్వ (భర్త,కూతురు) గతంలోనే చనిపోయారు

# బీజేపీ జూబ్లీహిల్స్ అభ్యర్థిపై నిర్ణయం తీసుకోలేదు

**- మోదీ నైతిక విలువలతో పాలన అందిస్తున్నారు**

**- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి త్వరలో జరగనున్న ఉపఎన్నికలో బీజేపీ తరఫున అభ్యర్థిని ఇంకా నిర్ణయించలేదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం శ్రీరామ్‌నగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను ఉప ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థి విషయమై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఇంకా ఏమీ అనుకోలేదన్నారు. కేటీఆర్ అందించిన స్క్రిప్ట్‌నే మీరూ చదువుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారన్న విలేకరుల ప్రశ్నకు.. సీఎం నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. అనంతరం నారాయణగూడలోని కేశవ మెమోరియల్ కళాశాల ఆడిటోరియంలో బీజేపీ మహిళామోర్చా ఆధ్వర్యంలో 'కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీ' అంశంపై నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

# 6న హైదరాబాద్‌కు జస్టిస్ ఘోష్

**మంత్రివర్గ ఆమోదం లేకుండానే బ్యారేజీల నిర్మాణం**

**కమిషన్‌కు ఆధారాలు సమర్పించిన సర్కారు**

**హైదరాబాద్, జూలై 2:** కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ ఈ నెల 6న హైదరాబాద్‌కు రానున్నారు. నాలుగు రోజుల పాటు ఆయన నగరంలోనే ఉండనున్నారు. ఇదిలా ఉండగా కాళేశ్వరం ప్రాజెక్టులో బ్యారేజీల నిర్మాణాలకు మంత్రివర్గం ఆమోదం లేదని నిరూపించే పత్రాలను అధికారులు బుధవారం కమిషన్ కార్యాలయంలో అందజేశారు. బ్యారేజీల నిర్మాణం కోసం నిర్ణయం తీసుకున్న ఏడాది తర్వాత.., అది కూడా నిర్మాణం ప్రారంభించి, డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించిన తర్వాత మంత్రివర్గంలో బ్యారేజీల నిర్మాణ నిర్ణయాన్ని ధ్రువీకరించుకున్నట్లు ఆధారాలతో కూడిన పత్రాలను కమిషన్‌కు అందించినట్లు తెలిసింది. కాగా, జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ముందు గత నెల 11న హాజరైన మాజీ సీఎం కేసీఆర్.. బ్యారేజీల నిర్మాణ నిర్ణయం తానొక్కడినే తీసుకోలేదని, మొత్తం మంత్రివర్గం కలిసి తీసుకున్నదని చెప్పిన విషయం తెలిసిందే. ఈటల, హరీశ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు బ్యారేజీలపై నిర్ణయం తీసుకోవడానికి అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ నేతృత్వంలో తుమ్మల నాగేశ్వరరావు, ఈటల రాజేందర్ సభ్యులుగా వేసిన మంత్రివర్గ ఉపసంఘం బ్యారేజీల నిర్మాణాలపై సిఫారసు చేసిందని కూడా విచారణలో చెప్పారు. అవన్నీ అవాస్తవాలని తుమ్మల ఖండించారు. ఈ నేపథ్యంలో వారిచ్చిన సాక్ష్యాలు కాకుండా.. ప్రభుత్వం వద్ద ఉన్న ఇతర వివరాలను అందించాలని కోరుతూ కమిషన్ లేఖ రాసింది. దీంతో కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంపై నిర్ణయం తీసుకున్న కొన్ని నెలల తర్వాత మంత్రివర్గంలో ఆ నిర్ణయాన్ని ర్యాటిఫికేషన్ చేసుకున్నారని.. కేసీఆర్, హరీశ్, ఈటల చెప్పినవన్నీ అవాస్తవాలంటూ సంబంధిత ఆధారాలను ప్రభుత్వం కమిషన్‌కు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ పత్రాలను అధ్యయనం చేసి, నివేదిక సమర్పించడానికి కమిషన్ మరింత గడువు కోరుతుందా? లేక ఈ నెలాఖరులోగా నివేదికను ఇస్తుందా? అన్నది తేలాల్సి ఉంది.

# ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న తాసిల్దార్ కార్యాలయం

**అనేవారు లేరు,అడిగే వారు లేరు**

**సమయపాలన పాటించాని అధికారులు - మా ఆఫీస్ మా,ఇష్టం అన్న తీరు**

**అధికారుల నిర్లక్ష్యం - ఆగ్రహించిన ప్రజలు**



**నాగర్ కర్నూల్ జిల్లా,ప్రజా వాయిస్**
ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు సమయానికి విధులకురావాల్సి ఉన్నప్పటికీ ఇష్టానుసారంగా హాజరవుతున్నారని,ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు సమయానికి రావాల్సింది పోయి మా ఆఫీస్,మా ఇష్టం అన్న చందంగా వ్యవహరిస్తున్నారు.మమ్మల్ని ఎవరేం చెయ్యలేరన్న ధీమాతో ఉదయం 11గంటలు అవుతున్న ప్రభుత్వ కార్యాలయానికి ఉద్యోగులు రాని ఘటన బుధవారం నాగర్ కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే రెవెన్యూ కార్యాలయంలో




11దాటినా ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి.జిల్లాలోని పలు గ్రామాలు ఈ రెవెన్యూ కార్యాలయానికి అటాచ్ అవడంతో రెవెన్యూ కార్యాలయానికి ప్రజలు వెళుతుంటారు.ఆఫీసులో పని చేసే ఉద్యోగులు 11దాటినా కార్యాలయంకి రాకపోవడంతో పనులకోసం వచ్చిన ప్రజలు వారి రాకకోసం ఎదురు చూసే దుస్థితి ఏర్పడింది.ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించకుండా పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు.రెవెన్యూ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో కాళీ కుర్చీలను చూస్తే అర్థమవుతుందని కార్యాలయానికి వచ్చే ప్రజలు ముచ్చటిస్తున్నారు.ఉద్యోగం చెయ్యడం ఇబ్బందికరంగా ఉంటే ఇంట్లో ఉండలే తప్ప ఇలా ఇష్టం వచ్చినప్పుడు వచ్చి విధులు నిర్వహించడం సరికాదని,ఇప్పటికైనా సమయపాలన పాటించాలని ఉద్యోగుల వివరాలు తెలుసుకొని శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఉన్నతాధికారులను కోరుకుంటున్నారు..

# ఆవును రక్షించిన రక్షకబడులు

**- తనవంతు సహకారం అందించిన మున్సిపల్ కమిషనర్.**

**- వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రెస్క్యూ ఆపరేషన్..**

**- పోలీసులకు, రెస్క్యూ సిబ్బందికి నెటిజన్ల ప్రశంసల వెల్లువ..**



నల్గొండ, ప్రజా వాయిస్

బుధవారం ఉదయం 11 గంటల సమయంలో నల్గొండ పట్టణంలోని బొట్టుగూడ ప్రాంతంలో విటల్ హాస్పిటల్ పక్కన ఉన్న పాత బావిలో ఓ ఆవు ప్రమాదవశాత్తు జారి పడిన ఘటన చోటుచేసుకుంది. ఈ విషయమై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారాన్ని వెంటనే గమనించిన నల్గొండ వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ రాజశేఖర్ రెడ్డి అత్యంత వేగంగా స్పందించారు.సీఐ ఆదేశాల మేరకు వన్ టౌన్ పోలీసు సిబ్బంది, ఎస్ఎఫ్ఓ సత్యనారాయణ రెడ్డి ప్రత్యేక బృందంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని రిస్క్యూ టీమ్‌ను సమన్వయం చేశారు. పర్యవేక్షణతో కూడిన ఈ రక్షణ చర్యలో పెద్దగా ఇబ్బంది లేకుండా ఆ ఆవును సురక్షితంగా బయటకు తీసి సురక్షిత ప్రదేశానికి తరలించారు.ప్రజల రక్షణకే కాదు, జీవ జాల సంరక్షణకు



కూడా నల్గొండ పోలీసులు ఎంత చురుకుగా స్పందిస్తారో ఈ సంఘటన మరోసారి నిరూపించింది. స్థానికులు పోలీసు అధికారుల వేగవంతమైన స్పందన లభించింది.విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ వెంటనే సంఘటన స్థలానికి మున్సిపాలిటీ జెసిబిలు, మరియు కార్మికులను పంపించి ఆవును రక్షించడంలో తనదైన పాత్రను పోషించారు. ఎస్ఎఫ్ఓ బృందం, మున్సిపల్ సిబ్బంది సహకారాన్ని ప్రశంసిస్తూ సిఐ అభినందనలు తెలిపారు.ప్రజల నమ్మకానికి నిలయంగా మారుతున్న నల్గొండ పోలీసులు %-% నెటిజన్లు, స్థానికుల ప్రశంసలు వెల్లువెత్తిస్తున్నాయి.

# జులై 7న దండోరా జెండాను ఎగురవేయండి..

**- తిప్పారపు లక్ష్మణ్ మాదిగ పిలుపు...**

**మల్కాజిగిరి, ప్రజా వాయిస్:**
ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, జూలై 7న ప్రతి మాదిగ బస్తీలో ప్రతి గ్రామంలో వాడవాడనా కన్నుల పండగ నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మేడ్చల్ మల్కాజిగిరి అనుబంధ సంఘాల ఇన్చార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం మల్కాజిగిరి నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయం వద్ద ఎంఆర్పిఎస్ అనుబంధ సంఘాల నాయకులతో కలిసి ఎలక్షన్ మాదిగ మీడియాతో మాట్లాడుతూ గత 25 రోజుల నుండి జిల్లాలోని ప్రతి గ్రామాన, మున్సిపాలిటీలలోని ప్రతి బస్తీ, ప్రతి వార్డున మాదిగ యువకులు, విద్యార్థులతో కలసి పెద్ద ఎత్తున నూతన కమిటీల నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. యువకులు కూడా ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారని చెప్పారు. నూతనంగా ఏర్పడ్డ కమిటీల ఆధ్వర్యంలో బస్తీలలో గ్రామాలలో ఎమ్మార్పీఎస్ నూతన జెండా గద్దెలను ఏర్పాటు చేసుకొని 7వ తేదీన జెండాలను ఎగురవేస్తూ సభలను నిర్వహిస్తూ 30 సంవత్సరాల ఉద్యమ స్ఫూర్తిని, ఉద్యమం సాధించిన విజయాలను ప్రజలకు తెలపాలనిచెప్పుకొచ్చారు. 30 ఏళ్ల



ఉద్యమ స్ఫూర్తిని ప్రతి గ్రామంలో ప్రతి వాడలో అన్ని సంఘాలకు తెలిపేందుకు అనుబంధ సంఘాలను కలుపుకొని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సాధించిన పెట్టిన (ప్రభుత్వ) ప్రజా సంక్షేమ పథకాలను అందజేసే విధానాన్ని ప్రతి ఒక్కరికి వివరించాలని సూచించారు. 30 సంవత్సరాల లో ఉద్యమానికి సహకరించిన ప్రతి వర్గానికి కృతజ్ఞతలు తెలపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు కెశపాగ రామచంద్ర, ఏం జే ఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్ మాదిగ,ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివ మాదిగ, వి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు ఎన్ వినయ్ మాదిగ, సీనియర్ నాయకులు మాషపాక రమేష్ మాదిగ, సూరంపల్లి అంజయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గుదల?

**- 12 నుంచి 5 శాతానికి తగ్గించే యోచనలో కేంద్రం**

**- పూర్తిగా ఎత్తేసే ప్రతిపాదన కూడా పరిశీలన - రాబోయే జీఎస్టీ మండలి సమావేశంలో నిర్ణయం**

**- టూత్‌పేస్ట్, నెయ్యి, సబ్బులు, పాదరక్షలు, దుస్తులు, వాషింగ్ మెషిన్లు తదితర వస్తువులు ఇక చౌక!**

**న్యూఢిల్లీ, జూలై 2:** మధ్యతరగతి ప్రజలకు శుభవార్త. ఈ ఏడాది ఆదాయ పన్ను రాయితీలతో ఊరట కల్పించిన కేంద్ర ప్రభుత్వం.. ఆయా వర్గాలకు మరింత ఉపశమనం కల్పించేందుకు సిద్ధమవుతోంది. మధ్యతరగతి, అల్పాదాయ కుటుంబాలకు వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ని తగ్గించడం ద్వారా ఊరట కల్పించనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 12 శాతం జీఎస్టీ పరిధిలో ఉన్న నిత్యావసర వస్తువులపై పూర్తిగా పన్నును తొలగించడం లేదా చాలా వస్తువులను 5శాతం జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చే అంశాన్ని పరిశీలిస్తోందని వెల్లడించాయి. టూత్‌పేస్ట్, టూత్ పౌడర్, గొడుగులు, కుట్టు మిషన్లు, ప్రెషర్ కుక్కర్లు, వంట పాత్రలు, నెయ్యి, సబ్బులు, చిరుతిళ్లు, ఎలక్ట్రిక్ ఇస్త్రీ పెట్టెలు, గీజర్లు, తక్కువ సామర్థ్యం కలిగిన వాషింగ్ మెషీన్లు, సైకిళ్లు, రూ.1000 కంటే ఎక్కువ ధర కలిగిన రెడీమేడ్ దుస్తులు, రూ.500-1000 ధర కలిగిన పాదరక్షలు, తదితర వస్తువులపై జీఎస్టీని తగ్గించనున్నట్లు సమాచారం. ఈ తగ్గింపు అమల్లోకి వస్తే చాలా వస్తువులు చౌకగా దొరుకుతాయి. సామాన్యులు వాడే ఈ నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తగ్గించడం వల్ల ప్రభుత్వంపై రూ.40-50వేల కోట్ల భారం పడనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ భారాన్ని మోసేందుకు సర్కారు సిద్ధమవుతోందనీ పేర్కొన్నాయి. ప్రజల వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకే జీఎస్టీ తగ్గింపు నిర్ణయం తీసుకుంటున్నట్లు వెల్లడించాయి. వస్తువుల ధరలు తగ్గితే విక్రయాలు పెరుగుతాయని, ఫలితంగా జీఎస్టీ వసూళ్లు కూడా పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం విశ్వసిస్తోంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో జీఎస్టీ రేట్లలో మార్పులు చేస్తామన్న సంకేతాలు ఇచ్చారు. నిత్యావసర వస్తువులపై పన్నులను హేతుబద్ధీకరిస్తామని, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా, జీఎస్టీ తగ్గింపుపై ఈ నెలలో జరగబోయే 56వ జీఎస్టీ కౌన్సిల్ భేటీలో నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు.




**12% జీఎస్టీ పరిధిలోని వస్తువులు ఇవే..**
టూత్‌పౌడర్, హెయిర్ ఆయిల్, సబ్బులు (కొన్ని విభాగాలపై 18% ఉంది), నెయ్యి, టూత్‌పేస్ట్ (కొన్ని బ్రాండెడ్ రకాలపై 12%, ఇతర పేస్ట్‌లపై 18%), గొడుగులు, కుట్టు మిషన్లు, వాటర్ ఫిల్టర్లు, ప్యూరిఫయర్లు (నాన్ ఎలక్ట్రిక్), ప్రెషర్ కుక్కర్లు, అల్యూమినియం, స్టీల్‌తో చేసిన వంట పాత్రలు, ఎలక్ట్రిక్ ఇస్త్రీ పెట్టెలు, గీజర్లు, వ్యాక్యూమ్ క్లీనర్లు (తక్కువ సామర్థ్యం, వాణిజ్యేతర), వాషింగ్ మెషీన్లు (తక్కువ సామర్థ్యం), సైకిళ్లు, దివ్యాంగుల వాహనాలు, రెడీమేడ్ దుస్తులు (రూ.1000పైన ధర కలిగినవి), పాదరక్షలు (రూ.500-1000), టీకాలు, హెచ్ఐవీ, హెపటైటిస్, టీబీ డయాగ్నస్టిక్ కిట్లు, కొన్ని ఆయుర్వేద, యునానీ మందులు, డ్రాయింగ్, కలరింగ్ పుస్తకాలు, రెడీ మిక్స్ కాంక్రీట్, ప్రి-ఫ్యాబ్రికేటెడ్ భవనాలు, వ్యవసాయ పనిముట్లు, ప్యాకేజ్డ్ ఆహారం, సోలార్ వాటర్ హీటర్లు. కాగా, సిగరెట్లు, విలాసవంతమైన కార్లు, కార్బొనేటెడ్ డ్రింక్స్ తదితర వస్తువులపై జీఎస్టీని భారీగా పెంచనున్నట్లు తెలుస్తోంది.

**రాష్ట్రాలూ అంగీకరించాలి..**
జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర ప్రభుత్వం మాత్రమే ముందుకు వస్తే సరిపోదు. ఆయా ప్రతిపాదనలపై రాష్ట్రాల మధ్య కూడా ఏకాభిప్రాయం కుదరాల్సి ఉంటుంది. పన్ను తగ్గింపునకు జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి. కౌన్సిల్‌లో ప్రతి రాష్ట్రానికీ ఓటు హక్కు ఉంటుంది. ప్రస్తుతం పంజాబ్, కేరళ, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ నుంచి కొంత వ్యతిరేకత ఉన్నట్లు తెలుస్తోంది. అయితే జీఎస్టీ కౌన్సిల్ చరిత్రలో ఇప్పటి వరకూ ఒక్కసారి మాత్రమే ఓటింగ్ జరిగింది. మిగిలిన అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే తీసుకోవడం విశేషం.

# ప్రభుత్వ పాఠశాల నిర్మాణ పనుల్లో జాప్యం ఎందుకు..?

**- తరగతి గదులు లేక టెంట్ క్రింద విద్యార్థుకు బోధన..**

**- ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదు..?**

**- బడంగ్పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి..**



**మహేశ్వరం ప్రజా వాయిస్ :**
బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి బుధవారం సందర్శించారు. గత ప్రభుత్వం లో ప్రారంభమైన నిర్మాణ పనులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కూడా పూర్తి కాలేదని విద్యార్థులు వర్షంలో తడుస్తూ టెంటు క్రింద కూర్చొని పరీక్షలు రాయవలసిన దుస్థితి బడంగ్ పేట్ కార్పొరేషన్ ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులకు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పది రోజుల క్రితం విద్యా కమిషన్ మెంబర్ పరిశీలించి వెళ్లిన నిర్మాణం పనుల్లో ఎలాంటి పురోగతి లేదని పాఠశాలలు ప్రారంభోత్సవము కంటే ముందే నిర్మాణం పూర్తి కావాల్సిన భవనం ఇంకా పూర్తి కాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని ప్రైవేట్ పాఠశాలలకు ప్రోత్సహిస్తూ వారికి కొమ్ముకాస్తున్నారని విమర్శలు గుప్పించారు. ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టి సారించి నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని రామ కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. అలాగే గతంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించిన భవనం మధ్య లోనే ఆగిపోయిందని, ఈ విషయం పై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని రామ కృష్ణారెడ్డి అన్నారు. నెల రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి కాకుంటే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యం లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమం లో అగ్గిశెట్టి సైదులు, జి మల్లేష్ గారు పాల్గొన్నారు.

## మహంకాళి జాతరకు ఆటంకాలు ఏర్పడకుండా పూర్తి ఏర్పాట్లు

**- మగ్గంపై పట్టు వస్త్రాలను తయారు చేసే పనులు ప్రారంభం..**

**- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్..**



**సికింద్రాబాద్, ప్రజా వాయిస్:**
బుధవారం సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జాయినీ మహంకాళి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి సమర్పించనున్న పోచంపల్లి పట్టు వస్త్రాలను మగ్గంపై తయారు చేసే పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నేత కార్మికులు, అఖిల భారత చేనేత కళా వైభవం ప్రతినిధులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బల్కంపేట ఎల్లమ్మ తల్లి కళ్యాణం సందర్భంగా, మహంకాళి జాతర సందర్భంగా ఆలయ ఆవరణలోనే నిష్ఠతో పోచంపల్లి పట్టు వస్త్రాలను మగ్గంపై నేసి అమ్మవారికి అందిస్తూ వస్తున్నారని తెలిపారు. ఇవే కాకుండా భద్రాచలం రాముల వారి కళ్యాణానికి కూడా వస్త్రాలను సమర్పిస్తున్న చైర్మన్ జయరాజ్, ఇతర సభ్యులను ప్రశంసించారు. మహంకాళి జాతర అంటే ఎంతో గొప్పగా నిర్వహించే పండుగ అన్నారు. ఈ నెల 13 వ తేదీన జరిగే మహంకాళి జాతర సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుండి లక్షలాది మంది భక్తులు వస్తారని, వారు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. తెల్లవారు జామున 3 గంటల నుండే అమ్మవారికి బోనాలు సమర్పించుకుంటారని చెప్పారు. అమ్మవారి ని దర్శించుకొని ఆమె ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం కూడా ప్రశాంతంగా, వైభవంగా జరిగిందని తెలిపారు. 10 సంవత్సరాల పాటు తాను కష్టపడి చేసిన ఏర్పాట్లు, ప్రయత్నాల ఫలితంగా బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగిందని చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఆలయ ఈ వో మనోహర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ లు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, చైర్మన్ కామేష్, బి అర్ ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, పద్మారావు నగర్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# కాలు లేని నిరుపేద వ్యక్తికి అండగా కాంగ్రెస్ నాయకుడు

**- కుటుంబానికి 15వేల ఆర్థిక సాయం అందజేత..**

**- నేనున్నానంటూ భరోసా ఇచ్చిన పిట్ల నాగరాజ్..**

**మల్కాజిగిరి (ప్రజా వాయిస్)**



మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అడుగు జాడలలో నడుస్తు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఆదేశాల మేరకు మల్కాజిగిరి నియోజకవర్గం, వినాయక నగర్ డివిజన్ లో నివాసం ఉంటున్న నిరుపేద వ్యక్తి మోహన్ కు ఇటీవల షుగర్ వ్యాధి వల్ల అతని ఒక కాలు వైద్యులు తీసేయడంతో మోహన్ ఏపని చేయలేని పరిస్థితి ఏర్పడి, మోహన్ వైద్యానికి తన ఇంటి ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కాంగ్రెస్ కార్యకర్తల ద్వారా తెలిసి, మోహన్ కు కాంగ్రెస్ పార్టీ నాయకుడు పిట్ల నాగరాజ్ బుధవారం మోహన్ ని పరామర్శించి, వారి కుటుంబానికి 15వేల రూపాయలతో రెండు నెలలకు సరిపోయే నిత్యావసర సరుకులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పిట్ల నాగరాజు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చేస్తున్న సేవలకు ప్రేరణ పొంది మైనంపల్లి ఆశీస్సులతో పేద ప్రజలకు తన వంతుగా సహాయం అందిస్తున్నానని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై ప్రత్యేక్షంగా పోరాడే అవకాశాన్ని ప్రజలు కల్పస్తేసే వకుడికిలా పనిచేస్తానని అన్నారు.కార్యక్రమంలో పిఎన్ఆర్ గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరంలో మలబార్ గోల్డ్, డైమండ్ కంపెనీ



ప్రజా వాయిస్,మహేశ్వరం నియోజకవర్గం.
మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో ఉన్న కేసీ తండా గ్రామపంచాయతీలోని మలబార్ గోల్డ్% డైమండ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు నూతనంగా నిర్మానించనున్న మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విచ్చేస్తున్న సందర్భంగా ముందస్తు ఏర్పాట్లు పరిశీలించడానికి మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ కిచన్నగారి లక్ష్మారెడ్డి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు...

## పోక్సో కేసులో నిందితునికి 20ఏళ్ల కఠిన జైలు శిక్ష

**జిల్లాలో నేరాలకు పాల్పడిన వారికీ జైలు శిక్ష తప్పదు**

**కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర**

ప్రజావాయిస్,కామారెడ్డి జిల్లా



పోక్సో కేసులో నిందితునికి 20సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం రాజేష్ చంద్ర తెలిపారు. 02.07.2022 లింగంపేట్ మండలం ముస్తాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, ఎప్పటిలాగే రాత్రి తన కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడనీ రాత్రి సుమారు 10 గంటల సమయంలో లేచి చూసినప్పుడు తన 14 ఏళ్ల మైనర్ కుమార్తె కనిపించలేదనీ చుట్టుపక్కల గాలించినా ఎటువంటి సమాచారం లభించకపోవడంతో 03 నాడు లింగంపేట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారన్నారు. పరిశోధనలో భాగంగా గ్రామస్తులను విచారించగ లింగంపేట్ మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన అక్కరేని శ్రీకాంత్ 20 సంవత్సరాలు, గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా మైనర్ బాలికతో పరిచయం ఏర్పర్చుకున్నాడనీ ఆమెను ప్రేమిస్తున్నాను అని మాయమాటలు చెప్పి ఫోన్ నంబర్ తీసుకుని తరచుగా మాట్లాడుతూ ఆమెను వేధించినాడన్నారు. 2న రాత్రి సమయంలో బాలికకు ఫోన్ చేసి ఇంట్లో నుండి బయటకు రమ్మని చెప్పి, బైక్‌పై మేడ్చల్ జిల్లా దబిల్‌పూర్ వద్దకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడన్నారు .బాలిక ఇంటివారు ఆమె కనిపించటలేదని లింగంపేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయాన్ని తెలుసుకొని నిందితుడు తేది 06న బాలికను లింగంపేట్ పోలీస్ స్టేషన్ వద్ద వదిలి పరారయ్యాడన్నారు. కేసులో సాక్షాలను సేకరించి నేరస్తుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం వేయడం జరిగిందన్నారు. సాక్షులను విచారించి, సాక్షాదారాలను పరిశీలించి కేసు రుజువు కావడంతో జిల్లా న్యాయమూర్తి వర ప్రసాద్ ని%శీ%దితునికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష 60,000 /- రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. పోలీసు తరపున వాదనలు వినిపించిన పీపీ కె. శేషు, ఈ కేసును సరియగు పద్ధతిలో విచారణ చేసిన అప్పటి ఎలారెడ్డి డిఎస్పి కె. శశాంక్ రెడ్డి, యస్ఐ కె. శ్రీకాంత్ , ప్రస్తుత ఎలారెడ్డి డిఎస్పి యస్. శ్రీనివాస్ రావు, యస్ఐ వెంకట్ రావు కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్పై రాజయ్య, ఏఎస్పై రామేశ్వరు రెడ్డి, సిడిఓ సాయిలు లను జిల్లా ఎస్పీ అభినందించారు.

## జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టగల్ల ప్రశాంత్ మాదిగ**



ప్రజావాయిస్, వికారాబాద్ జిల్లా.
బుధవారం రోజున నవాబుపేట్ మండలం ఎల్లకొండ గ్రామంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ 30ఏళ్ల పోరాటం ద్వారా అమలు జరుగుతుందని,వర్గీకరణ మాదిగ,మాదిగ ఉప కులాలకు సామాజిక న్యాయం జరుగుతుందని తెలిపారు. ఎమ్మార్పీఎస్ కేవలం మాదిల కోసమే కాకుండా సమాజంలో అన్ని వర్గాల సమస్యల పరిష్కరణ కోసం పోరాటం చేసింది ,ఈ నెల జులై 7న ఎలకొండ గ్రామంలో జరగబోయే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని గట్టగల్ల ప్రశాంత్ (రాష్ట్ర కార్యదర్శి) తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అధికారి



నాగర్ కర్నూల్ జిల్లా ప్రజా వాయిస్
నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని వైద్యాధికారి ప్రియాంక, జిల్లా టీకాల అధికారి రవి నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరోధక టీకాలు గర్భిణీ స్త్రీలకు, చిన్నపిల్లలకు అందుతున్నావా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవలు చేసుకోవాలని సాధారణ ప్రసవల వాళ్ళ వల్ల కలిగే లాభాలపై గ్రామాలలో అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఓపి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి అక్కడ అందుతున్న వైద్య సేవల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. మందుల స్టోరేజ్ రూమ్ ను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. వర్షాకాలంలో ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని, సీజన్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని వైద్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఆశ వర్కర్లు జయమ్మ, పార్వతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# క్రమం తప్పకుండా ఎత్తు బరువు కొలవాలి

**- పిల్లలకు పౌష్టికాహారం మాత్రమే అందించాలి - అధికారులకు ఆదేశాలు ఇచ్చిన కలెక్టర్**



ప్రజా వాయిస్,కామారెడ్డి జిల్లా
అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు,గర్భిణీలకు నాణ్యతతో కూడిన పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని మాత్రమే అందించాలని,జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ మహిళ శిశు అభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ మహిళా, శిశు సంక్షేమ శాఖ పై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ముందు శ్యామ్, మామ్ పిల్లల శాతం అంగన్వాడీల వారీగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పౌష్టికాహారలోప పిల్లలకు ప్రత్యేక పౌష్టికాహారం అందించి క్రమం తప్పకుండా వారి ఎత్తు బరువులు కొలిచి వారు ఆరోగ్యవంతమైన పిల్లలుగా ఎదిగేల చర్యలు తీసుకోవాలి అన్నారు. వర్షాకాలం వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున అంగన్వాడి పరిసరాలను శు భ్రంగా ఉంచుతూ వేడి ఆహార పదార్థాలను అందించాలని అన్నారు.

అంగన్వాడి కేంద్రాలను విసిట్ చేసేటప్పుడు చిన్నారులు హాజరు శాతం తక్కువగా ఉంటుందని ఇకనుండి అంగన్వాడి కేంద్రాల్లో రిజిస్టర్ అయిన పిల్లలందరూ తప్పకుండా అంగన్వాడి కేంద్రాలకు వచ్చేలా జిల్లా సంక్షేమ అధికారి, సిడిపిఓలు, సూపర్వైజర్లు ప్రతిరోజు అంగన్వాడి కేంద్రాలను విజిట్ చేయాలని అలాగే అంగన్వాడి కేంద్రాల్లో గుర్తించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావాలని అన్నారు. అసంపూర్తిగా ఉన్న అంగన్వాడి భవనాల నిర్మాణం మరియు వాటర్, ఎలక్ట్రిసిటీ, టాయిలెట్స్ మొదలగు పనుల గురించి చర్చించి ఆయా నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. వివిధ సందర్భాలలో గృహహింసకు గురైన మహిళలకు సఖి కేంద్రం ద్వారా సేవలు అందించాలని, అనాధ పిల్లల దత్తత, వివిధ సందర్భాల్లో రిస్కు చేసిన బాలలకు సంరక్షణ చర్యలు తీసుకోవాలని, న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్లో చిన్నారులకు సౌకర్యాలు మెరుగుపరచాలని, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్ నాయక్, డి ఎం అండ్ హెచ్ వో చంద్రశేఖర్, ఈ ఈ పిఆర్, విద్యుత్తు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు,సిడిపిఓ లు, సూపర్వైజర్లు, మహిళా మరియు శిశు సంక్షేమశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింగాచి పరిశ్రమ ప్రమాదంపై అధికారుల మౌనం ఎందుకు

**- పరిశ్రమలో పనిచేసేది ఎంతమంది? - ఇప్పటివరకు మృతుల సంఖ్య ఎంత?**

**- గాయపడ్డ వారు ఎంత? - సురక్షితంగా ఉన్నది ఎంత?**

**- ప్రమాదం జరిగి రోజులు గడుస్తున్న వివరాలను వెల్లడించని జిల్లా కలెక్టర్**

**- మంత్రులు చెప్తే కానీ నోరూ విప్పలే - గతంలోనూ ఈ పరిశ్రమలో ప్రమాదం**

సంగారెడ్డి, ప్రజా వాయిస్
పఠాన్ చెర్ పారిశ్రామిక వాడలోని పాషా మైలారంలో గల సింగాచి పరిశ్రమలో ఇటీవల రియాక్టర్ పేలడంతో సుమారు 42 మంది మృతి చెందినట్లు ప్రాథమికంగా తోటి కార్మికులు కుటుంబ సభ్యుల సమాచారం ద్వారా తెలుస్తుంది. కానీ అధికారులు మాత్రం కేవలం 12 మంది మాత్రమే మృతి చెందారని ప్రకటించి జిల్లా కలెక్టర్ వారికి సంబంధించిన పరిహారం చెల్లించడంతోపాటు శభాలను వారి స్వగ్రామాలకు తరలించారు. అసలు ఈ పరిశ్రమలో ఎంత మంది పనిచేస్తున్నారు...? ప్రమాదం జరిగిన సమయంలో విధులకు ఎంతమంది వచ్చారు... అందులో రెగ్యులర్ ఉద్యోగులు ఎంత మంది, కార్యాలయ సిబ్బంది ఎంతమంది అనేది రికార్డులను పరిశీలింస్తే బయటపడే అవకాశం ఉంది. కానీ హెచ్ఆర్ డిపార్ట్మెంట్ సంబంధించిన భవనం పూర్తిగా కూలిపోవడంతో కార్మికులకు సంబంధించిన రికార్డులన్నీ బూడిద అయిపోయాయి. పరిశ్రమల షిఫ్ట్ 150 మంది కార్మికుల పనిచేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. వారితోపాటు పరిశ్రమ మేనేజర్ కార్యాలయ సిబ్బంది మరో 20 నుంచి 30 మంది వరకు ఉంటారని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. సాక్షాత్తు పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న అడిషనల్ జనరల్ మేనేజర్ సైతం ఈ ప్రమాదమును మృతి చెందడం బాధాకరం. అయినప్పటికీ ఆయనతో పాటు ఆ కార్యాలయంలో కనీసం 10 మందికి పైగానే కార్మికులు ఉంటారని తోటి ఉద్యోగులు చెబుతున్నారు. ఇప్పటివరకు అధికారులు 12 మంది చనిపోయారని ప్రకటించారు. అది కేవలం బాధిత కుటుంబాలను తప్పు దువ్వకు పట్టించే ప్రయత్నం చేస్తున్నారనే ఎందుకు ప్రధాన కారణం. ఎందుకంటే మృతుల సంఖ్య 42 ఉంటుందని సాక్షాత్తు మార్చూరులో ఉన్న మృతదేహాల సంఖ్యను పరిశీలిస్తే స్పష్టంగా అర్థమవుతుంది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ప్రమాదం జరిగి మూడు రోజులైనా ప్రమాదం జరిగే రోజు ఎంత మంది విధులకు హాజరయ్యారు.... అందులో రెగ్యులర్ ఉద్యోగులు ఎంతమంది.. కాంట్రాక్ట్ కార్మికులు ఎంతమంది.. కార్యాలయ సిబ్బంది ఎంతమంది అనేది ఇప్పటివరకు తేల్చలేకపోయారు. దీన్నిబట్టి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఎంతమంది చనిపోయారు అన్నది అధికారులు గోప్యంగా ఉంచుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. అలా అలా కాకుంటే చనిపోయిన కుటుంబాల వారి వివరాలను ఎప్పటికప్పుడు మీడియాకు ప్రకటించేది. జిల్లా అధికార యంత్రాంగం కానీ.. పరిశ్రమ యజమాని కూడా ప్రకటించలేదు.



**మంత్రులు వచ్చేదాకా**
**వివరాలు వెల్లడించని అధికారులు....**

పరిశ్రమల్లో ప్రమాదం జరిగిన సందర్భంలో బాధ్యతాయుతంగా స్థాయిలో ఉన్న జిల్లా కలెక్టర్ జరిగిన ప్రమాదం ఏ స్థాయిలో ఉంది... ఎంతమంది కార్మికులు పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్నారు... చనిపోయిన వారి వివరాలను... గుర్తించలేని శవాల వివరాలను కూడా బాధ్యతగా జిల్లా కలెక్టర్ ప్రకటించవలసి ఉంటుంది. కానీ మంత్రుల సిఫారసుల మేరకు కలెక్టర్ ఇంతవరకు ఎక్కడ కూడా పర్సనల్ నకు విధులకు వచ్చిన వారి సంఖ్య.. ప్రమాదంలో చనిపోయిన వారి సంఖ్య ఎంత అనేది తెలుపవలసిన బాధ్యత జిల్లా మేజిస్ట్రేట్గా ఆమెపై ఉంటుంది. కానీ జిల్లా కలెక్టర్ సైతం అధికార పక్షానికి తొలంగి అమాయక కార్మికుల ప్రాణాలను పోగొట్టుకున్నారు.

**గతంలోనూ ప్రమాదం.**

% సింగచ్చి పరిశ్రమలో జరిగిన ప్రమాదం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా ఇలాంటి ప్రమాదం జరిగి కార్మికులు మృతి చెందారని తోటి కార్మికులు ఆరోపించారు. అప్పట్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సైతం పరిశ్రమ యజమానిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తాజాగా జరిగిన సంఘటనతో అర్హత లేని వ్యక్తులతో ఆపరేటింగ్ చేయించడం వల్ల రియాక్టర్ పిలవడానికి ప్రధాన కారణమని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆరోపించారు. అర్హత ఉన్న వ్యక్తులను మాత్రమే పనిలోకి తీసుకోవాలని... ప్రతి సంవత్సరం పరిశ్రమల సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు భద్రత చర్యలు, యంత్రాల మరమ్మతులను చేయవలసిన పనులపై సూచనలు ఇస్తా ఉండాలి. కానీ మామూళ్ల మత్తులో అధికారులు మునిగిపోవడమే కాకుండా ప్రజాప్రతినిల ఒత్తిడి మేరకు పరిశ్రమలను తనిఖీ చేయకుండా వదిలేయడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరిగి అమాయక కార్మికులు మృత్యు వాత పడుతున్నారు. వారికి కోట్ల రూపాయల పరిహారం చెల్లించిన వారి కుటుంబానికి పెద్ద దిక్కులు మాత్రం తెచ్చుకోలేని పరిస్థితి. దీనిపై అధికార పక్షం కాకుండా ప్రత్యక్ష పార్టీలు సైతం ఉద్యమిస్తే కానీ కార్మికుల భద్రతకు భద్రత లేదని చెప్పవచ్చు.

# ఫోన్ ట్యాపింగ్ వ్యక్తి గోప్యతా హక్కు ఉల్లంఘనే

**మద్రాసు హైకోర్టు స్పష్టం**

**చెన్నై, జూలై 2:** ప్రజా అత్యవసర పరిస్థితి లేదా ప్రజా ప్రయోజనాల విషయంలో తప్ప ఇతరత్రా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడడం వ్యక్తి ప్రాథమిక గోప్యతా హక్కు ఉల్లంఘనేనని మద్రాస్ హైకోర్టు తేల్చి చెప్పింది. నేరాలు గుర్తించడానికి ఒక వ్యక్తి లేదా వ్యక్తుల ఫోన్ సంభాషణలు రహస్యంగా వినేందుకు అనుమతి లేదని స్పష్టం చేసింది. దేశ సార్వభౌమాధికారం, సమగ్రత, రాష్ట్ర భద్రత, విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు, తీవ్ర నేర ప్రేరేపణ వంటి వాటిని నిరోధించడం కోసం అథారిటీ సంతృప్తి చెందిన తర్వాతే ట్యాపింగ్ ఉత్తర్వులను జారీ చేయాల్సివుంటుందని స్పష్టం చేసింది. టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5(2), టెలిగ్రాఫ్ రూల్స్ 1951లోని రూల్ 419-ఏ కింద ఒక అవినీతి కేసుకు సంబంధించి తన ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతి ఇస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఓ ప్రైవేటు కంపెనీ ఎండీ పి.కిశోర్ హైకోర్టులో వేశారు. దాని విచారణ సందర్భంగా బుధవారం న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం ఈ మేరకు స్పష్టం చేసింది. చట్టంలోని సెక్షన్ 5(2) పరిధిని విస్తరించాలన్న కేంద్రం వాదనను కూడా ధర్మాసనం తిరస్కరించింది. అంతేగాక చట్టంలోని సెక్షన్ 5(2) కింద నిర్దేశించిన లక్ష్మణ రేఖను దాటలేరని తేల్చిచెప్పింది. ప్రస్తుత కేసులో అధికారులు ట్యాపింగ్ విషయాన్ని సమీక్ష కమిటీ ముందు ఉంచలేదని, అందువల్ల నిబంధనల ఉల్లంఘన జరిగిందని పేర్కొంది. చట్టంలోని సెక్షన్ 5(2), నిబంధనలలోని నిబంధన 419-ఎ(17)ని ఉల్లంఘించి ఈ విషయాన్ని సేకరించినందున, ఆ విషయాన్ని ఏ ఉద్దేశానికైనా ఉపయోగించరాదని ఆదేశించిన ధర్మాసనం..



పిటిషనర్ ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి కేంద్రం గతంలో జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేసింది.

# రష్యా చమురు కొంటే 500% సుంకం

**అమెరికాలో బిల్లు.. భారత్‌పై తీవ్ర ప్రభావం**

**వాషింగ్టన్, జూలై 2 :** ఉక్రెయిన్‌తో యుద్ధం తర్వాత రష్యాకు మిగిలిన అతి పెద్ద ఆదాయ వనరు చమురు. రష్యాపై ఆర్థిక ఆంక్షలు మరింత కఠినతరం చేయాలంటే ఆ దేశం నుంచి చమురు కొంటున్న దేశాలపై భారీగా సుంకాలు విధించాలంటూ అమెరికా సెనేటర్ లిండ్సీ గ్రహమ్ ఒక బిల్లు తయారుచేశారు. అధ్యక్షుడు ట్రంప్ సూచనతోనే ఈ బిల్లు తయారైందని వార్తలు వెలువడుతున్నాయి. రష్యా చమురులో 70 శాతం భారత్, చైనాలే కొంటున్నాయి. అంటే గ్రహమ్ బిల్లు ప్రధానంగా ఈ రెండు దేశాలనే లక్ష్యంగా చేసుకున్నట్టు స్పష్టమవుతోంది. ఇటువంటి దేశాలు అమెరికాకు ఎగుమతి చేసే సరుకులపై 500 శాతం సుంకం విధించాలని తన బిల్లులో ఆయన ప్రతిపాదించారు. రష్యా దగ్గర చమురు



కొనడం అంటే ఉక్రెయిన్‌కు మద్దతు నిరాకరించినట్టే భావించాల్సి ఉంటుందని ఆ బిల్లులో పేర్కొన్నారు. తన బిల్లుకు ట్రంప్ మద్దతు ఇచ్చారని, దీనిపై ముందుకెళ్లడానికి ఇదే సరైన సమయమని ఆయన సూచించారని గ్రహమ్ తెలిపారు. తన బిల్లు సెనేట్‌కు ఆగస్టులో రావచ్చునని తెలిపారు. నిజానికి, 2022లో ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం మొదలవగానే ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు భగ్గుమన్నాయి. భారత్‌కు చౌకగా చమురు ఇవ్వడానికి ఈ సమయంలో రష్యా ముందుకొచ్చింది. యుద్ధానికి ముందు భారత్‌కు ప్రపంచ దేశాల నుంచి దిగుమతి అయిన చమురు ఉత్పత్తుల్లో ఒక శాతం కంటే తక్కువగానే రష్యా నుంచి అందేవి. ఇప్పుడు ఆ పరిమాణం 40-45 శాతానికి పెరిగిపోయింది.